క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు : ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో సంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని యాచకులు, వృద్ధులతోపాటు నిస్సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో న్యాయవాది సుమంత్, సునీల్, రాజు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మేయర్ సురేష్‌బాబు

అట్లూరు : మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డిని ఆదివారం కడప మేయర్ కె. సురేష్‌బాబు పరామర్శించారు. అయితే ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రామకృష్ణారెడ్డి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మేయర్ ఆదివారం రామకృష్ణారెడ్డికి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి



కౌన్సిలర్ తల్లి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ హసన్ తల్లి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఉమర్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సరిటాలమౌలాలి, షరీఫ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



విజయమ్మను సన్మానిస్తున్న అధికారులు, కుటుంబసభ్యులు

బ్రహ్మంగారిమఠం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని హాస్టల్ ఉద్యోగులు అన్నారు. బి.మఠం ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న పి.విజయమ్మ పదవీ విరమణ చేయడంతో మైదుకూరులో తోటి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సత్కరించారు. పలువురు మట్లాడుతూ విజయమ్మ బి.మఠం హాస్టల్‌లో కమాటీగా బాధ్యతలు చేపట్టి వార్డెన్ స్థాయికి చేరారన్నారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ కుటుంబ సభ్యులు ప్రసాద్, తదితరులు పాల్గొని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

కుప్పానికి నీరిచ్చిన ఘనత వైఎస్.జగన్‌దే

ఖాజీపేట : కుప్పం ప్రజలకు హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నీరందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగకపోయినా ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచామని కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం సరికాదన్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గెలవడం ఒక గెలుపేనా అంటూ విమర్శించారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలని ఎంపీ అవినాష్‌రెడ్డి సవాల్ విసిరినా స్పందన లేదన్నారు. పులివెందుల అసెంబ్లీ ఎన్నికలు జరపాలంటూ బీటెక్ రవీ చెప్పడం కాదు.. ధైర్యం ఉంటే 175 అసెంబ్లీ స్థానాలు రద్దు చేసి మళ్లీ గెలవాలని కూటమి నేతలకు సవాల్ విసిరారు. 2029 ఎన్నికల్లో ప్రజలే కూటమి ప్రభుత్వాన్ని రఫ్ఫా రఫ్ఫా చేస్తారని చెప్పారు.

దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం బాధాకరం

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకవైపు దివ్యాంగులకు పెన్షన్ల కింద ఇచ్చే మొత్తాన్ని పెంచినట్లే పెంచి మరోవైపు లక్షల సంఖ్యలో దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం బాధాకరమని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాల ఆవరణలో నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లను భారంగా భావించి రీవెరిఫికేషన్ పేరుతో వైకల్యశాతాన్ని తగ్గించడం దారుణమన్నారు. ఎంతో మంది నిరుపేద దివ్యాంగులు పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న తరుణంలో ఉన్నపలంగా పెన్షన్ తొలగిస్తే వారి కుటుంబాలు ఎలా జీవిస్తాయనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు.

వేడుకగా గణనాథుని గ్రామోత్సవం



మహర్షి హైస్కూల్ వీధిలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు





కామనూరు వద్ద కుందూ నదిలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



పోరుమామిళ్ల: నిమజ్జనానికి తరలివచ్చిన విగ్రహాలు



బద్వేలు అర్బన్ : నిమజ్జనానికి వెళుతున్న కొండారెడ్డివీధి గణనాథుడు



బద్వేలు అర్బన్ : వినాయకుడికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదినంగా పలు ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాథులను ఆదివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. వైఎంఆర్ కాలనీ, సాయి రాజేశ్వరి కాలనీ, బొల్లవరం, మిట్టమడి వీధి, రామేశ్వరం, సూపర్ బజార్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి ట్రాక్టర్లు, లారీలలో తదితర వాహనాల్లోకి ఎక్కించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, రంగులు చల్లుకుంటూ, బాణ సంచా పేల్చుతూ జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అంటూ యువత నినాదాలు చేస్తూ ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కొన్ని కమిటీల వారు ఉట్టికొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. రామేశ్వరం పెన్నానది, కామనూరు వద్ద కుందూ నది, చాపాడు వద్ద కుందూ నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. చాలా వరకు ఆదివారం గణాథులను నిమజ్జనానికి తరలించగా.. సోమవారం కొన్ని కమిటీల వారు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించనున్నారు.

నేడు కామనూరు బ్రిడ్జి వద్ద అన్నప్రసాదం పంపిణీ

ప్రొద్దుటూరు : గణేష్ నిమజ్జనం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం కామనూరు కుందూ నది బ్రిడ్జి వద్ద ఉన్న గోశాలలో అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిమజ్జనాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో యథావిధిగా సోమవారం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద సేవ నిర్వహించడంతోపాటు నగర గణేష్‌ఉత్సవ కేంద్ర కమిటీ, శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో గోశాలలో 2 వేల మందికి అన్నప్రసాదం అందిస్తామన్నారు.

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

మైదుకూరు : మైదుకూరు పట్టణం, పరిసర గ్రామాల్లో నెలకొల్పిన మండపాల నుంచి గణనాథుని విగ్రహాలను వాహనాల్లో బాణసంచా మేళ తాళాలతో పట్టణ వీధుల్లో ఊరేగించారు. సమీపంలోని కుందూ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. స్థానిక అనుకుంట వీధిలో సిద్ధి వినాయక సార్వజనిక గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహించిన లడ్డూ వేలంలో లక్షా వేయి రూపాయలకు కొట్టి ఓబయ్య, వెండి కాయిన్‌ను రూ.26 వేలకు ఆకుల గురుసాయిహర్ష, చెరకుగడలను రూ.1000కి శ్రీరామ్ సాయికుమార్ పాడి సొంతం చేసుకున్నారు. విజయనగర కాలనీలో వరసిద్ధి వినాయక యూత్ నిర్వహించిన వేలంలో మాదం రమణ రూ.92 వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. నంద్యాల రోడ్డులో బాల గణేష్ యూత్ నిర్వహించిన వేలంలో గుండంరాజు ప్రతాప్ రూ.49 వేలకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమం వద్ద వినాయకుడి లడ్డూను సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మీదేవి కుమారుడు నరసింహరెడ్డి, ఉప సర్పంచ్ ఆర్‌సీ ఎస్‌ఆర్ కంట్రాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, జి.వినోద్, బి.మార్తు నరసింహారెడ్డి, ఎ.కిరణ్‌కుమార్‌రెడ్డిలు రూ.1.65 లక్షలకు దక్కించుకున్నాడు. మహిళలు ఏర్పాటు చేసిన లడ్డును రూ.75 వేలకు కొత్తకోట అనూష, లక్ష్మి, స్వప్న దక్కించుకున్నారు. స్వామివద్ద ఉంచిన వెండి కలశం రూ.80 వేలకు డీసీఎంఎస్ పర్టిలైజర్ నిర్వాహకుడు నరసింహారెడ్డి దక్కించుకున్నాడు. స్వామి వద్ద ఉంచిన రూ.10 నోట్ల దండను రూ.26 వేలకు గూడూరు బాలవెంకటరెడ్డి, చెరుకు గడలను రూ.10వేలకు ఆశ్రమంలోని వంట మాస్టర్ శ్యాం దక్కించుకున్నారు. స్వామి నిమజ్జనంకోసం బ్రహ్మంసాగర్‌కు తీసుకెళ్లారు.

గంగ ఒడిలోకి గణనాథులు

బద్వేలు అర్బన్ : వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలు 5వరోజు నిమజ్జనంలో భాగంగా ఆదివారం వైభవంగా గంగ ఒడికి చేరుకున్నాయి. పట్టణంలోని కొండారెడ్డివీధి, గాంధీనగర్, బెస్తవీధి, వినాయకనగర్, సురేంద్రనగర్, ఎగువ బ్రాహ్మణవీధి, వెంకటయ్యనగర్, గాండ్లవీధి, దూదేకులవీధి, కుమ్మరికొట్టాలు, మిద్దెలవారిపాళెం, ఆంజనేయనగర్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలు నిమజ్జనానికి బయలుదేరాయి. ఆయా విగ్రహాల గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, కులుకుభజన, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. యువకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందంతో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు అన్ని విగ్రహాల ఊరేగింపుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు

కాశినాయన : వినాయక చవితి రోజున కొలువుతీరిన గణనాథులు ఐదవ రోజున ఆదివారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు నిమజ్జనానికి తరలించి విఘ్నేశ్వరుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గణనాథులుకు గ్రామోత్సవం నిర్వహించారు. బాణ సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటూ యువత జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అంటూ నిమజ్జనానికి తరలి వెళ్లారు.

భక్తి శ్రద్ధలతో నిమజ్జనం

అట్లూరు : భక్తి శ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం నిర్వహించు కోవాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. ఐదవ రోజు నిమజ్జనానికి తరలుతున్న గణేష్ మంటపాల వద్దకు వెళ్లి ఆయన కమిటీ సభ్యులతో పాటు ఆయా గ్రామస్తులకు నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 72 విగ్రహాలు నెలకొల్పారని మూడవ రోజు 55 విగ్రహాలను నిమజ్జనం చేశారని,

జయమునివ్వు గణేశా

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో మండపాలను అలంకరించి స్వామికి ఐదు రోజులపాటు పూజలు జరిపారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం పలుచోట్ల లడ్డూల వేలం జరిగింది. ఏటూరులో స్వామి లడ్డూను చందా లక్ష్మిరెడ్డి రూ.60 వేలకు దక్కించుకున్నారు. వెండి కాయిన్‌ను రూ.13 వేలకు శేషారెడ్డి, డబ్బుల దండను రూ.13 వేలకు మునికుమార్‌రెడ్డి, చెరుకు గడలను చందాశ్రీనివాసులరెడ్డి రూ.3 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. సన్నపల్లె గ్రామంలో వెలిచర్ల ఓబుల్‌రెడ్డి రూ.60 వేలకు వేలం పాడి స్వామి లడ్డూను దక్కించుకోగా, సుంకేశులలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి రూ.40,500లకు, చిన్న లడ్డూను కోటా కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.28వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. రూపాయి బిల్లను శివశంకర్‌రెడ్డి రూ.5,200లకు దక్కించుకున్నారు.



ఖాజీపేట: అగ్రహారంలో నిమజ్జనానికి తరలిన వినాయకుడు

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని మైదుకూరురోడ్డులో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడి వద్ద, దూదేకుల వీధిలో ఏర్పాటు చేసిన లంబోదరుడి వద్ద ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆమెకు ఆయా మండపాల నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేయడంతో పాటు ఆమెను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయి క్రిష్ణ, బూత్‌కమిటీల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వర్‌రావు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు సునీల్, వార్డు ఇన్‌చార్జిలు అనిల్, ఖాజాలతో పాటు ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా లడ్డు వేలంపాట

బద్వేలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఐదవ రోజు నిమజ్జనం సందర్భంగా ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్థానిక విద్యానగర్‌లో స్వామి వద్ద ఉంచిన లడ్డూను రూ.1.25 లక్షలకు మాధవ్, ప్రవీణ్, సునీల్, సాయి సొంతం చేసుకున్నారు. అలాగే కొండారెడ్డివీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను బత్తలపల్లి శ్రీనివాసులరెడ్డి రూ.90 వేలకు దక్కించుకున్నాడు. అలాగే వెంకటయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ఉంచిన లడ్డూను రూ.78 వేలకు తుమ్మిశెట్టి సునీల్‌కుమార్ సొంతం చేసుకున్నాడు. ఆంజనేయనగర్ నాగభూషణంవీధి వద్ద ఏర్పాటు చేసిన గణేషుడి వద్ద ఉంచిన లడ్డూను రూ.40 వేలకు ఎంఆర్‌ఎఫ్ రమణారెడ్డి వేలం పాటలో దక్కించుకున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

కలసపాడు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేశ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఉల్లాసభరితంగా గ్రామవీధుల్లో వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. కొన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని పూజకు పెట్టిన లడ్డును వేలంపాటలో అధికంగా పాడి దక్కించుకున్నారు. ఐదవ రోజు కొన్ని గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కలసపాడు, ఎగువ రామాపురం, ఎగువ తంబళ్ళపల్లె, ముసల్‌రెడ్డిపల్లె, మామిళ్ళపల్లె గ్రామాల్లోని వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రూ.2.11 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ మండలంలోని దూలంవారిపల్లె గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో అదే గ్రామానికి చెందిన పంజగల నడిపిరామయ్య, నామాల రమణయ్య ఇరువురు కలిసి రూ.2.11 లక్షలకు వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు.

వినాయకుడి నిమజ్జనం

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన ఘననాథుడి నిమజ్జనం ఆదివారం కమిటీసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ శివప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఇంద్రనగర్ వాసులు వేషధారణలతో అలరించారు. ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏఎస్ఐలు రామకృష్ణా రెడ్డి, సిద్దయ్య, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చియ్యపాడులో లడ్డూ రూ.50వేలు

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో నాయీ బ్రాహ్మణసంఘం ఏర్పాటు చేసిన వినాయకుడి సన్నిధిలో లడ్డూను చిన్నన్నగారి వెంకటేశ్వర్లు, వసంత, శ్రీధర్, రమ్యశ్రీ, శ్రీనివాస్, శశిధర్, సౌమ్య కుటుంబీకులు రూ.50 వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

గ్రామాల్లో లడ్డూ వేలం

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల వద్ద ఉంచిన లడ్డూ, కలశం సెంబు, వెండి నాణెంను ఆదివారం కమిటీ సభ్యులు వేలం పాట నిర్వహించారు. దీంతో కమిటీకి భారీగా ఆదాయం లభించింది. కుమ్మరపల్లెలో వినాయక లడ్డూను వేలంపాట నిర్వహించగా కె.వి రమణ అత్యధికంగా రూ.26000 పాటపాడి దక్కించుకున్నారు. అలాగే సోమాపురం గ్రామంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో దిద్దికుంట చక్రవర్తి రూ.66500 పాట పాడి దక్కించుకున్నారు. మొత్తం రూ.1,13500 కమిటీకి ఆదాయం లభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అర్కటవేముల గ్రామంలో మహాలక్షుమ్మ ఆలయం వద్ద ఉన్న వినాయకుడి లడ్డూను వేలంపాట నిర్వహించగా కందుకూరు కిషోర్ కుమార్ రెడ్డి రూ.90 వేలు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే పర్లపాడులో వినాయకుడి లడ్డూను కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించగా తాటి ఆదినారాయణ అత్యధికంగా రూ.1,13000 పాట పాడి దక్కించుకున్నాడు. అలాగే టంగుటూరు గ్రామంలో శివసేన కమిటీ నిర్వహించిన లడ్డూ వేలంపాటలో మొదటి లడ్డూను గోనా యుగంగధర్ రెడ్డి కుమార్తె గోనా చైత్ర సింహా రెడ్డి రూ.16000, రెండవ లడ్డూ టంగుటూరు సురేష్ రూ.21000, వెండి నాణెం టంగుటూరు సురేష్ రూ.15000, కలశం సెంబు గుద్దేటి విష్ణువర్ధన్ రెడ్డి రూ.12000 పాట పాడి దక్కించుకున్నారు.

త్రిపురవరంలో లడ్డు ధర రూ 3,10,000



లడ్డు దక్కించుకున్న విశ్వనాథరెడ్డి

ఖాజీపేట : వినాయక చవితి సంసందర్భంగా త్రిపురవరంలో పెద్ద లడ్డూను కమిటీ సభ్యుల ద్వారా వేలం నిర్వహించారు. గుర్రంపాటి విశ్వనాథరెడ్డి రూ 3,10,000 పాడి స్వామి లడ్డూను దక్కించుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ధర పలకడం ఇదే తొలిసారి అని స్థానికులు తెలిపారు.

మల్లేపల్లెలో లడ్డు రూ 1.50లక్షలు



లడ్డూ దక్కించుకున్న చెంద్రాయుడి కుటుంబసభ్యులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లెలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద లడ్డూ వేలం వేయగా అదే గ్రామానికి చెందిన బత్తల చెంద్రాయుడు రూ.1.50 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.1.05 లక్షలు పలికిన లడ్డు



జీపీ వెంకటసుబ్బారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కానపల్లె అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డు వేలం పాటలో జీపీ వెంకటసుబ్బారెడ్డి రూ.1.05 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జీపీ వెంకటసుబ్బారెడ్డి దంపతులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు పూలమాల, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వారి ఇంటి వరకు సాగనంపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పుత్తా రవీంద్రారెడ్డి, గుమ్మళ్ల చిన్నవెంకటసుబ్బారెడ్డి, బైగ్గారి వెంకటసుబ్బారెడ్డి, నాగాయపల్లె గాలం బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

రూ. 2 లక్షలు పలికిన లడ్డు



పోరుమామిళ్ల: వినాయకుడి లడ్డూతో రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పోరుమామిళ్ల : రెడ్డినగర్ వరసిద్ధి వినాయక, కోదండ రామస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన లంబోదరుడిని లడ్డూను వేలం పాటలో రామ్మోహరెడ్డి అనే భక్తుడు రూ. 2 లక్షలకు దక్కించుకున్నారు. చిన్న పిల్లల లడ్డూను అవినాష్‌రెడ్డి రూ. 16 వేలకు, శ్రీలక్ష్మీకుబేర నాణేలను వరకుమారి రూ. 25 వేలకు, చాక్లెట్ దండను లిఖిత్‌రెడ్డి రూ. 16 వేలకు, లక్ష్మీ గవ్వలను లక్ష్మీదేవి రూ. 5,500లకు దక్కించుకున్నారు. అలాగే మండలంలోని నరసింగపల్లెలో వినాయకుడి లడ్డూను ఆదివారం రూ.లక్షా ఇరవై వేలకు మోపూరి పెద్ద ఓబయ్య దక్కించుకున్నారు. కలశం చెంబును రూ. 22,500 ఈశ్వరయ్య, చెరుకుగడలను రూ. 11,500 అరిశ దక్కించుకున్నారు. వెంగమాంబ పాఠశాల దగ్గర వినాయక లడ్డూను రూ. 76 వేలకు రమణ సొంతం చేసుకున్నారు.

నిమజ్జన ఘాట్‌ల వద్ద పటిష్ట పోలీసు భద్రత

ప్రొద్దుటూరు క్రైం : వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రధాన ఘాట్‌ల వద్ద పోలీసు ఉన్నతాధికారులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కామనూరు కుందు బ్రిడ్జి, రాజుపాళెం మండలంలోని వెల్లాల కుందు వంతెన వద్ద నిమజ్జనం ఘాట్‌లను ఏర్పాటు చేశారు. ఐదో రోజు కావడంతో ఆదివారం పెద్ద ఎత్తున గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ ప్రాంతాల్లో పోలీసు, ఫైర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. కుందూ నది వంతెనల వద్ద బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.



కామనూరు బ్రిడ్జి వద్ద భద్రతను పరిశీలిస్తున్న రూరల్ సీఐ నాగభూషణం

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పొద్దుపోయే వరకు విగ్రహాలను నిమజ్జనం చేస్తుండటంతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. కుందూ నదిలో నీరు ఎక్కువగా ప్రవహిస్తున్నందున కామనూరు బ్రిడ్జి వద్ద మహిళా కానిస్టేబుల్ మైక్ ద్వారా చిన్న పిల్లలు, మహిళలకు సూచనలు చేశారు. చిన్న పిల్లలు వంతెన చివరికి వెళ్లకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. డీఎస్పీ భావన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ రాజు, అగ్నిమాపక అధికారి బషిరెడ్డి భద్రతా చర్యలు చేపట్టారు.



కామనూరు బ్రిడ్జి వద్ద మైక్ ద్వారా సూచనలు చేస్తున్న మహిళా కానిస్టేబుల్

సైన్స్ అభివృద్ధితోనే సమాజం అభివృద్ధి

ప్రొద్దుటూరు కల్చరల్ : సైన్స్ అభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ జిల్లా మహాసభలను నిర్వహించారు. జాతీయ జెండాను రిటైర్డ్ ఎంఈఓ గడియారం వెంకటేశ్వర్లు, జేవీవీ జెండాను డాక్టర్ నరసింహారెడ్డి ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి జేవీవీ జిల్లా అధ్యక్షుడు షామీర్‌బాషా అధ్యక్షత వహించారు. మృతి చెందిన జేవీవీ నాయకులు గంగిరెడ్డి, అబ్బాస్ వలిలకు మహాసభ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ(హెచ్) అమలు చేసి శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు అందించాలన్నారు. శాస్త్ర విద్యావిధానం కోసం బడ్జెట్‌లో ప్రత్యే నిధులు కేటాయించాలన్నారు. సైన్స్ ప్రయోగశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించాలన్నారు. పాలకులే అశాస్త్రీయ వాదనలకు బలం చేకూర్చడం దురదృష్టకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ ఫలాలను అందరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైవీయూ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మూఢ నమ్మకాలను శాస్త్రీయ విద్య ద్వారానే అరికట్టగలమని తెలిపారు.



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు

ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో హిందీ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సంస్కృతి సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ గీతాశ్రమంలో సంస్కృతి అకాడమి ద్వారా డీఎస్సీ హిందీ ఉపాధ్యాయులకు 400 మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. వీరిలో 207 మంది స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంక్‌తోపాటు 4 జిల్లాల డిస్ట్రిక్ట్ ఫస్టులు, 7 జిల్లాల డిస్ట్రిక్ట్ సెకండ్‌లు, అంతేకాకుండా దాదాపు 20 మంది 80 మార్కులుపైగా సాధించారని తెలిపారు. వీరిని ఫోన్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ అభినందించారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

అడవుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

బద్వేలు అర్బన్ : అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని జిల్లా అటవీ ,అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు ఫారెస్టు రేంజ్ పరిధిలోని లంకమల అభయారణ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉద్యోగులు, ప్రకృతి ప్రేమికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇన్ టు ద నేచర్ సభ్యులతో ట్రెక్కింగ్ నిర్వహించారు. అభయారణ్యంలోని చిరుత బేస్‌క్యాంపు నుండి లంకమల జలపాతం వరకు దాదాపు 5 కిలోమీటర్ల మేర సాగిన ఈ ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు, ఎర్రచందనం వృక్షాల పరిరక్షణకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ట్రెక్కింగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ట్రెక్కింగ్‌లో భాగంగా అటవీ ప్రాంతంలోని అరుదైన వృక్షాలు, వన్యప్రాణులు, ఆయుర్వేద మొక్కలు, బయోడైవర్సిటీ గురించి వివరించడంతో పాటు మానవుల ప్రభావం వలన అడవులకు జరిగే నష్టాన్ని వివరించారు. రాబోవు రోజుల్లో మరిన్ని ట్రెక్కింగ్ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంపొందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటశేషయ్య, ఎఫ్ఎస్ఓ ఖాజావల్లి, ఎఫ్‌బీఓలు రాజేష్‌రెడ్డి, సుదర్శనం, బాలచెన్నయ్య, సుంకయ్య, పుష్పరాజ్, ఏబీఓలు తదితరులు పాల్గొన్నారు.



లంకమల అభయారణ్యంలో ట్రెక్కింగ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ వినీత్‌కుమార్